క్లుప్తంగా

అంతిమ కష్టాలు



మృతదేహాన్ని తీసుకుని పొలాల మధ్య వెళుతున్న గ్రామస్తులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం కృష్ణాపురం పంచాయతీలోని దిగువ మల్లవరంలో శ్మశానవాటికకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో అంతిమ సంస్కారాలు చేయడానికి కష్టాలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. శుక్రవారం చిన్నస్వామి అనే వ్యక్తి మృతి చెందారు. గ్రామం నుంచి శ్మశానానికి వెళ్లేందుకు దారిలేకపోవడంతో పొలాల మధ్యలో పాడెను మోసుకుని వెళ్లారు. వర్షాకాలం మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బంగారమ్మకాలనీలో శుక్రవారం బంగారమ్మకాలనీ అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వనమాలినాయుడు, మనోహర్, మాధవయ్య, సోమశేఖర్‌నాయుడు, లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలంలో వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఈ రమేష్ తెలిపారు. ఆయన శుక్రవారం రేణిగుంట పంచాయతీ పాంచాలి నగర్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యల నివారణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామన్నారు. ఇందులో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్లు మారుస్తున్నామని, ప్రస్తుతమున్న వాటి సామర్థ్యం పెంచుతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో అర్బన్ ఏఈ పుణ్యకోటి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.


ముక్కంటి సేవలో వీహెచ్‌పీ నాయకుడు



ఆలయం వద్ద నందిరెడ్డి సాయిరెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం వీహెచ్‌పీ ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ శ్రీకాళహస్తి కార్యదర్శి వశాంక్‌చ గూడూరు జిల్లా భజరంగ్‌దళ్ సంయోజక్ శాండిల్య, సతీష్, లోకేష్, హేమంత్, కిరణ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని తేరువీధిలో ఉన్న ఆలయ బస్సు షెల్టర్ వద్ద శుక్రవారం పౌర్ణమి సందర్భంగా జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 1993–94 పూర్వ విద్యార్థులు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ పౌర్ణమి, భీష్మ ఏకాదశి సందర్భంగా అన్నదానం చేసినట్టు తెలిపారు. సుమారు 300 మందికి పైగా అన్నదానంలో పాల్గొన్నట్టు తెలిపారు.

వేలం ఎప్పుడు వేస్తారు సారూ..!

రేణిగుంట పట్టణంలోని కూటమి నాయకుల మధ్య సయోధ్య కుదరకపోవడంతో పంచాయతీ వేలం పాటలు పూర్తికావడం లేదు. ఇప్పటికే రెండుసార్లు వేలంపాటలను వాయిదా వేశారు. మూడోసారి వేలం పాటలు నిర్వహించేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. ఈసారైనా వేలం పాటలు పూర్తి చేస్తారా..? లేదా అన్న చర్చ జరుగుతోంది.

– రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్)

- వారపు సంత, దుకాణాలకు వేలం నిర్వహించని అధికారులు
- కూటమి నేతల మధ్య కుదరని సయోధ్య
- ఇప్పటికే రెండు సార్లు వాయిదా
- మూడో సారైనా జరుగుతుందా అన్న అనుమానం



రేణిగుంట బస్టాండ్ వద్ద ఉన్న పంచాయతీ దుకాణ సముదాయం

రేణిగుంట మేజర్ పంచాయతీకి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వారపు సంత, కూరగాయల మార్కెట్, పంచాయతీ దుకాణాలు, గేటు వసూళ్లకు గత డిసెంబర్‌లో ఒకసారి, ఫిబ్రవరిలో మరొకసారి వేలంపాటలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వివిధ దినపత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. చివరి నిమిషంలో వాయిదా వేశారు. రెండుసార్లు అదేవిధంగా జరగటంతో షాపులను చేజిక్కించుకునేందుకు ప్రయత్నించిన ఆశావాహులకు నిరాశ ఎదురైంది. పట్టణానికి చెందిన కూటమి నేతల్లో ఒక వర్గం వారపు సంత, కూరగాయల మార్కెట్, షాపులను సొంతం చేసుకునేందుకు ప్రయత్నించడం, మరొక వర్గం తప్పనిసరిగా వేలంపాటలు నిర్వహించాలని పట్టుబట్టారు. దీంతో వేలం పాటలను చివరి నిముషంలో రెండు సార్లు వాయిదా వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు నాయకుల మధ్య సమోధ్య కుదరలేదు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో మూడో సారి వేలం పాటలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మార్చి నెలాఖరులోగా వేలంపాటలు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ సారైనా సవ్యంగా వేలంపాటలు జరుగుతాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. పంచాయతీ దుకాణాలను జీవనాధారంగా చేసుకొని జీవనం సాగిస్తున్న కొంతమంది దుకాణదారులు వేలంపాటలు నిర్వహించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకుని వేలంపాటలును నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

భోజనంలో బొద్దింక



భోజనంలో ఉన్న బొద్దింక

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని రామసేతు వంతెన సమీపంలో ఉన్న ఒక ప్రముఖ హోటల్‌లో శుక్రవారం భోజనంలో బొద్దింక కనిపించింది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు బస్సు దిగిన వెంటనే పక్కనే ఉన్న హోటల్‌కు భోజనం చేయడానికి వెళుతుంటారు. సిబ్బంది, యాజమాన్యం తగిన జాగ్రత్తలు పాటించడం లేదు. గతంలో భోజనంలో మనిషి వెంట్రుకలు వచ్చాయి. ప్రస్తుతం బొద్దింక ఉండడాన్ని భక్తులు గుర్తించారు. ఈ విషయాన్ని అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి చూపించడంతో తీసేయండి వేరే ప్లేట్ పెడతామని హడావుడి చేశారు. ఆహార పదార్థాల నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్న హోటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఎండ వేడిమి తాళలేక భక్తుల పరుగో పరుగు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఎండ వేడిమిని తాళలేక పరుగులు తీయాల్సి వస్తోంది. భిక్షాల గాలిగోపురం, శివయ్య గోపురం నుంచి ఆలయంలోకి ప్రవేశించే భక్తులు చెప్పులను రంగుల గోపురం వద్ద వదలిపెడతారు. దర్శనానంతరం తిరిగి నాలుగవ గేటు నుంచి బయటకు వస్తే అక్కడి నుంచి సుమారు 400 మీటర్లు రోడ్డుపై నడవాల్సి ఉంటుంది. ఎండవేడిమికి కాళ్లు కాలుతుండడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఆలయ అధికారులు రోడ్డుపై రెండు వైపులా పుట్‌పాత్ కానీ, కూల్ పెయింట్ వేయాల్సి వున్నా పట్టించుకోవడం లేదు. ఆర్టీసీ బస్సుల్లో దిగే భక్తులను భిక్షాల గాలిగోపురం వద్ద ఉన్న దళారులు వెంటబడి మరీ చెప్పులు, లగేజీ తమ దుకాణంలో పెట్టుకుని పూజా సామగ్రి కొంటే చాలని మోసం చేస్తున్నారు. వారు దర్శనానంతరం చెప్పులు పెట్టిన చోటుకు నడవాల్సి వస్తోంది. ఆలయం లోపల కూడా ఏ గేటు నుంచి భక్తులు వస్తారో తెలుసుకుని అక్కడ వారి సామగ్రి చేరేలా తిరుచానూరు విధానంలో ఏర్పాటు చేయాలని లేని పక్షంలో భక్తులు మైకుల ద్వారా అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.



కాలు కాలడంతో పరుగులు తీస్తున్న భక్తులు

గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం

శ్రీకాళహస్తి: గ్రామాల్లో పారిశుధ్యం లోపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి ఆరోపించారు. తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి, కంచనపల్లి, చిట్టత్తూరు గ్రామాల్లో శుక్రవారం రెండో రోజూ ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. దళితవాడల్లో ఇళ్ల ముందే మురుగు నీరు నిల్వ ఉందని, దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబులుతున్నాయని ఆరోపించారు. దళితవాడల్లో నేటికీ సరైన మౌలిక వసతులు లేవని వాపోయారు. బోనుపల్లి దళితుల శ్మశానానికి దారి సౌకర్యం లేక ఏళ్ల తరబడి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సీపీఎం నాయకులు పెనగడం గురవయ్య, గెడి వేణు, రాజా, గురునాథం, చుట్టు గురవయ్య, చందన్ కుమార్, గిరి తదితరులు పాల్గొన్నారు.



బోనుపల్లిలో మురుగు నీటి నిల్వలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

23న హలో మాల–చలో తిరుపతి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : మాలల జేఏసీ ఆధ్వర్యంలో 23న తిరుపతిలో హలో మాల– చలో తిరుపతి కార్యక్రమం నిర్వహించనున్నట్టు నాయకులు తెలిపారు. వారు శుక్రవారం రాత్రి రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ, క్రిమిలేయర్ రాజ్యాంగ విరుద్ధమన్నారు. వాటిని చేపడితే మాలలు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. మాలలను విడగొట్టి రాజకీయం చేసేందుకు చాలామంది ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ క్రమంలో జిల్లాలోని మాలలు అందరూ తిరుపతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొని మాలల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలల గెజిటెడ్ అసోసియేషన్ చైర్మన్ వెంట్రపాటి శ్రీనివాసరావు, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ చైర్మన్ అత్తూరు సుబ్రహ్మణ్యం, జయరామయ్య, మల్లారపు మధు, ఎస్సీ సంఘం నాయకుడు బాల, సర్పంచ్ నగేషం, తులసి రాజన్, మురళీ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాలల జేఏసీ నేతలు

మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి



రజనీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న యానాది, దళిత సంఘం నాయకులు

శ్రీకాళహస్తి: బీఎన్‌కండ్రిగ మండలం వరత్తూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రజనీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని దళిత, యానాది సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారు మాట్లాడుతూ ఒకరు మరణించడం, ఇద్దరు తీవ్రంగా గాయపడడం కుటుంబం వీధిన పడిందన్నారు. రోజురోజు కూ రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నా ప్రయత్నం నివారణకు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. 108 అంబులెన్సులు కూడా అందుబాటులో లేకపోవడంతో క్షతగాత్రులు మృత్యువాత పడుతున్నారని ఆరోపించారు. రజనీ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనమాల గురవయ్య, రొడ్డ గోపి, చారుశీల, కోటయ్య, బత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. మహాకుంభాభిషేకం

నాగలాపురం: ద్రౌపదీ సమేత ధర్మారాజస్వామి ఆలయంలో శుక్రవారం వైభవంగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, సుమంగళి పూజ, కన్య పూజ, వేద ప్రబంధ పారాయణం, ఆలయ ప్రవేశ ద్వార ప్రదక్షిణ, గోపుర శిఖర సంప్రోక్షణ, దేవతా సంప్రోక్షణ, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ క్రమంలోనే భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం కనులపండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూరహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

హోలీ.. రంగులకేళీ

శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉత్సాహంగా హోలీ పండుగ నిర్వహించారు. పిల్లలు.. పెద్దలు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు.

– వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ, నాగలాపురం, రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్)



బుచ్చినాయుడుకండ్రిగలో..



నాగలాపురంలో..



రేణిగుంటలో..



వరదయ్యపాళెంలో..

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

రేణిగుంట: వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. యూత్ వింగ్ అధ్యక్షుడిగా సూరా సురేష్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా టి.పర్వీన్, రైతు విభాగం అధ్యక్షుడిగా శ్రీరాములురెడ్డి, బీసీ సెల్ విభాగం అధ్యక్షుడిగా ఎస్.శివయ్య, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడిగా పసల కృష్ణయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా వెంకటాద్రి, మైనార్టీ సెల్ పఠాన్ ఫరీద్, విద్యార్థి విభాగం పి.కార్తీక్, మున్సిపల్ వింగ్ ఆశాకిరణ్, లీగల్ సెల్ లక్ష్మీపతి, వైఎస్సార్ టీయూసీ జగత్‌రెడ్డి, ఐటీ వింగ్ భరత్‌కుమార్‌రెడ్డి, వీవర్స్ వింగ్ అల్లయ్య, గ్రీవెన్స్ సెల్ అయోధ్య, పంచాయతీరాజ్ వింగ్ పి.బాలసుబ్రమణ్యంరెడ్డి, వలంటీర్స్ వింగ్ ఆర్.చెంచయ్యనాయుడు, దివ్యాంగుల విభాగం టి.మోహన్, కల్చరల్ విభాగం రామ్మూర్తి, ఆర్టీఐ విభాగం బి.బాలాజి, వాణిజ్య విభాగం భాస్కర్, క్రిస్టియన్ మైనార్టీ విభాగం ఎస్.డేవిడ్, డాక్టర్స్ విభాగం శంకరయ్య, సోషల్ మీడియా విభాగం జయక్రిష్ణ, బూత్ కమిటీ విభాగం బత్తిశెట్టి, పబ్లిసిటీ విభాగం దిలీప్ నియమితులయ్యారు.

వైభవంగా ఊంజల్‌సేవ



ప్రత్యేక అలంకరణలో పద్మావతీదేవి

నారాయణవనం : పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం తిరుచ్చిపై అమ్మవారిని కొలువుదీర్చి ఊరేగించారు. అధికారులు నాగరాజు, భరత్, అర్చకులు శ్రీధరభట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, నరసింహభట్టాచార్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నాగలాపురం: మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ, బీరకుప్పం సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏడీ రమేష్ చంద్ర, ఏఈ పృథ్వీ తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్వహణ, మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెంచమ్మకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: కల్లిపూడి గ్రామంలో చెంచమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొని చెంచమ్మకు ప్రత్యేక పూజలుచేశారు. ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్వర్ణమూర్తి, మాజీ కౌన్సిలర్ కంట ఉదయ్ కుమార్, దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీవారి సురేష్, కల్లిపూడి గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

శ్రీకాళహస్తి : రాష్ట్రంలోని పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 23 వరకు కొనసాగుతాయి. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. పదో తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో పరీక్షలు ముగిసే వరకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు ఉంటాయని వెల్లడించారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలంలో శుక్రవారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. తిరుపతి – కడప రోడ్డులోని కుక్కలదొడ్డి వద్ద ఆగివున్న మినీ లారీని కంటైనర్ ఢీకొంది. అదే సమయంలో వెనుక వస్తున్న కారు కంటైనర్‌ను ఢీకొంది. కారులోని వారికి ఎవరికీ గాయాలు కాలేదు. మినీ లారీ డ్రైవర్ గాయపడ్డాడు. అతన్ని 108లో తిరుపతి రుయాకు తరలించారు. అలాగే పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారిలోని మల్లవరం సమీపంలో శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తి నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌లో వెళుతున్న కరకంబాడి పంచాయతీకి చెందిన యువకులు గాయపడ్డారు. వారిని రుయాకు తరలించారు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ బోల్తాపడి..

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం కన్నలి ఎస్టీకాలనీ వద్ద శుక్రవారం బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కందుకూరుకు చెందిన మధుసూదన్‌రావు(48), శివనాగరాజు(35) బైక్‌లో అరుణాచలం వెళ్లి తిరిగి శుక్రవారం స్వగ్రామం బయలుదేరారు. మార్గమధ్యంలో కన్నలి ఎస్టీ కాలనీ వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. మధుసూదన్‌రావు తీవ్రంగా గాయపడ్డాడు. శివనాగరాజు స్వల్పంగా గాయపడ్డాడు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్వేలతో సతమతం!

- దీర్ఘకాలిక సెలవుపై వెళ్లే యోచనలో పంచాయతీ కార్యదర్శులు



వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయం

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం అనాలోచితంగా చేయిస్తున్న సర్వేలతో పంచాయతీ కార్యదర్శులు మానసిక వేదనకు గురవుతున్నారు. నిత్యం టార్గెట్ విధించి వేధిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. విధించడంతో ఒత్తిళ్లకు గురవుతున్నారు. రోజూ టెలీ కాన్ఫరెన్సులతో మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు ఒత్తిడి చేస్తుండడంతో తట్టుకోలేక దీర్ఘకాలిక సెలవుపై వెళ్లేందుకు పలువురు కార్యదర్శులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను జవాబుదారీగా చేస్తూ మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, వర్క్ ఫ్రమ్ హోమ్, హౌస్ హోల్డ్ జియో టాక్స్, పీ4 సర్వే, పీఏసీఎస్ సర్వే, లెదర్ ఆర్టిజెన్స్ సర్వే, 0–6 ఏళ్ల పిల్లల ఆధార్ మిస్సింగ్ సర్వే, నాన్ ఏపీ రెసిడెన్స్ సర్వే, ఇంటిపన్నులు, కొళాయి పన్ను వసూళ్లతో పాటు ఆయా సర్వేలపై ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించి చిన్న విషయానికి కూడా వివరణ అడుగుతుండడంతో కార్యదర్శులతోపాటు సచివాలయాల సిబ్బంది సైతం సతమతమవుతున్నారు. ఈ క్రమంలో సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీపురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ మండలాల్లోని పలువురు కార్యదర్శులు మూకుమ్మడిగా సెలవు పెట్టనున్నట్లు తెలిసింది.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

బుచ్చినాయుడుకండ్రిగ : పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రధానోపాధ్యాయుడు రూపేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సరస్వతి పూజ జరిపించారు. అలాగే పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను అందుకునేందుకు పదోతరగతి తొలి మెట్టు అని వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీమురళి, సురేష్‌బాబు, నాదెండ్ల మురళి, ప్రసాద్, వేణుగోపాల్, దాసు, మాధవీలత, దేవేంద్ర, లక్ష్మయ్య, జగన్నాథం, దీపిక పాల్గొన్నారు.



సరస్వతి పూజలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఏర్పేడు మీదుగా బస్సులు నడపాలి

ఏర్పేడు(రేణిగుంట): శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వెళ్లే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు ఏర్పేడు బస్టాండులోకి రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో శ్రీకాళహస్తి నుంచి వచ్చే బస్సులు మేర్లపాక నుంచి పాత మార్గంలో ఏర్పేడుకు వచ్చి అక్కడి నుంచి తిరుపతికి వెళ్లేవి. వారం రోజులుగా మేర్లపాక టోల్ గేట్ వద్ద పాత రోడ్డు మూసేసి బస్సులను కొత్తగా ఏర్పాటైన ఆరులేన్ల రహదారి వైపు మళ్లించారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కూడా ఆ మార్గం గుండానే వచ్చి, కోబాక మార్గంలో సర్వీసు రోడ్డు గుండా ఏర్పేడు చివరన ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్ట్ మీదుగా తిరుపతి వెళుతున్నాయి. దీంతో విద్యార్థులు, వృద్ధులు విషయం తెలియక బస్సుల కోసం ఏర్పేడు బస్‌స్టాప్ వద్ద గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. మరి కొందరు చెక్‌పోస్ట్ వరకు నడిచి వెళ్లి అక్కడ ఎండలో నిల్చుని బస్సులు ఎక్కుతూ అవస్థలు పడుతున్నారు. మండలంలో సుమారు 20 గ్రామాల నుంచి ప్రయాణికులు ఏర్పేడుకు వచ్చి బస్సులు ఎక్కుతూ ఉంటారు. బస్సులు సర్వీస్ రోడ్డు నుంచి ఏర్పేడు లోపలికి వచ్చి ఏర్పేడు లోపల ఆర్టీసీ బస్టాండ్ వద్ద తిప్పుకుని ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లాలని స్థానికులు కోరుతున్నారు.

పొలాల్లోకి దర్జాగా రోడ్డు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం ప్రజల సౌకర్యం కోసం రోడ్డు వేస్తున్నట్టు కూటమి నేతలు కలరింగ్ ఇచ్చి తమ పొలాల్లోకి రోడ్డు వేసుకున్నారు. గతంలో కన్నలి కాలువలో పడి విద్యార్థిని మృతి చెందింది. పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించకుండా పాలకులు తమ ప్రైవేటు వెంచర్ కోసం యుద్ధప్రాతిపదికన కన్నలి కాలువ కల్వర్టు గోడను తొలగించి రోడ్డు వేయడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భవిత పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, లేకుంటే పిల్లలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రహరీగోడ నిర్మాణానికి అడ్డుపడుతూ వచ్చిన నాయకులు ప్రస్తుతం రోడ్డు నిర్మాణం కోసం ఉన్న గోడను తొలగించడం దారుణమని స్థానికులు చెబుతున్నారు. కల్వర్టును ధ్వంసం చేస్తుంటే ఇరిగేషన్‌శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కల్వర్టు తొలగించి వేసిన రోడ్డు

శింగిరికోనలో పౌర్ణమి పూజలు

నారాయణవనం: మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం ఘనంగా పౌర్ణమి పూజలు నిర్వహించారు. శింగిరి కోనలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకం జరిపించారు. ధన్వంత్రి, మహాలక్ష్మి, నృసింహస్వామి, నవగ్రహ హోమం చేపట్టి పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు గిరిబాబు, భాస్కర్‌బాబు మాట్లాడుతూ భక్తులకు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే స్థానిక సొరకాయల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



శింగిరికోనలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు